సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 23 । జూన్ । 2024



అన్ని వేళలా అప్రమత్తం 8లో

పోలీస్ స్టేషన్లలో సిబ్బంది అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని పాడేరు ఏఎస్పీ ధీరజ్ ఆదేశించారు.

కొత్త కలెక్టర్‌గా దినేష్‌కుమార్



సాక్షి, పాడేరు: కలెక్టర్ ఎం.విజయ సునీతకు బదిలీ అయింది. ఆమె స్థానంలో ప్రస్తుత ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను నియమిస్తూ శనివారం రాత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. విజయ సునీతను జీఏడీకి రిపోర్టు చేయవలసిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా తొలి కలెక్టర్ సుమిత్‌కుమార్ స్థానంలో సార్వత్రిక ఎన్నికలకు ముందు విజయ సునీత కలెక్టర్‌గా నియమితులయ్యారు. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించి ఎన్నికల సంఘం ప్రశంసలు పొందారు.

న్యూస్‌రీల్

ఆకాశవాణి కేంద్రానికి స్థల పరిశీలన

- చింతపల్లిలో 50 సెంట్లు కేటాయింపు
- తహసీల్దార్ రామకృష్ణ



ఆకాశవాణి కేంద్రం నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి రూరల్: చింతపల్లి కేంద్రంగా త్వరలో ఆకాశవాణి కేంద్రం ఏర్పాటు కానున్నట్టు తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. ఈ కేంద్రం నిర్మాణానికి సంబంధించి శనివారం ఆయన స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్ ఇండియా రేడియో ఆకాశవాణి కేంద్రం మండల కేంద్రంలో ఎత్తయిన ప్రదేశంలో ఉండేలా చర్యలు స్థల పరిశీలన చేస్తున్నామని తెలిపారు. సుమారు 50 సెంట్ల భూమిని గుర్తించినట్టు చెప్పారు. త్వరలోనే ఈ కేంద్రం పనులు ప్రారంభం అవుతాయని తహసీల్దార్ తెలిపారు.

వ్యవసాయ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి గడువు పెంపు

రంపచోడవరం: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని స్థానిక వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి వ్యవసాయ డిపొమా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. దొమ్మలపాటి సుధాకరరావు తెలిపారు.ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు. 15 నుంచి 20 సంవత్సరాల వయస్సు కలిగిన పదవ తరగతి లేదా దానికి సమానమైన అర్హత కలిగిన అభ్యర్థులు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులని తెలిపారు. ఇంటర పరీక్ష ఉత్తీర్ణత చెందని అభ్యర్థులు కూడా ఈ కోర్సులో చేరేందుకు అర్హత ఉందన్నారు. పూర్తి వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించి తెలుసుకోవాలని ఆయన సూచించారు.ఆసక్తి గల వారు పూర్తి వివరాలు ఇక్కడికి సమీపంలోని ఇర్లపల్లి గ్రామంలోని కళాశాలకు వచ్చి తెలుసుకోవాలని కోరారు.

ఆయిల్ ట్యాంకర్ బోల్తా

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- సీలేరు ఆస్పత్రిలో చికిత్స
- బ్రేక్ ఫెయిల్ కావడంతో ప్రమాదం



బోల్తా పడిన ఆయిల్ ట్యాంకర్

సీలేరు: మండలంలోని ధారాలమ్మ ఘాట్‌రోడ్డులో ఆయిల్‌ట్యాంకర్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది.ఈ ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విశాఖపట్నం నుంచి స్థానిక జీసీసీ బంక్‌కు శనివారం ఉదయం పెట్రోల్, డీజిల్ లోడ్‌తో వచ్చిన ఆయిల్ ట్యాంకర్ అన్‌లోడ్ చేసింది. అనంతరం తిరిగి విశాఖపట్నం బయలుదేరింది. ధారాలమ్మ ఘాట్‌రోడ్డు ప్రాంతంలో సప్పర్ల రైన్‌గేజ్ వద్దకు వచ్చేసరికి అదుపు తప్పింది. బ్రేక్‌ఫెయిల్ కావడంతో వంద అడుగుల లోయలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను స్థానికులు సీలేరు ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

రాజవొమ్మంగిలో 20.8 ఎంఎం వర్షపాతం



రాజవొమ్మంగిలో వర్షానికి ముందు ఆకాశంలో ఉరుములు మెరుపుల దృశ్యం

రాజవొమ్మంగి: మండలంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి 20.8 ఎంఎం వర్షపాతం నమోదైంది. ఖరీఫ్ సాగుకు ఉపయోగకరమని వ్యవసాయశాఖ తెలిపింది. మరోపక్క రైతులు వరి నారుమడుల తయారీ పనుల్లో నిమగ్నమయ్యారు.

సంతల్లో ఇష్టారాజ్యం

ఖరీఫ్ వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో ఏజెన్సీలోని వారపు సంతల్లో విత్తన విక్రయ దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. తెలంగాణ, ఒడిశా నుంచి వరి విత్తనాలను ప్యాకెట్ల రూపంలో తీసుకువచ్చి నిబంధనలకు విరుద్ధంగా అనధికారికంగా విక్రయిస్తున్నారు. గిరి రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా వ్యాపారులు బహిరంగంగా విక్రయిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- అనధికారికంగా వ్యాపారుల విత్తన విక్రయాలు
- హైబ్రిడ్ రకాల పేరుతో రెట్టింపు ధరకు అమ్ముతూ దోపిడీ
- కొనుగోలు చేసిన గిరి రైతులకు ఇవ్వని రశీదులు
- పంటకు నష్టం జరిగిన సందర్భంలో పరిహారం కోల్పోతున్న అన్నదాత
- విక్రయాలకు అనుమతులు లేవంటున్న వ్యవసాయశాఖ



వారపు సంతలో వ్యాపారి వద్ద విత్తనాలు కొనుగోలు చేసి తీసుకువెళ్తున్న రైతు



హుకుంపేటలో శనివారం జరిగిన వారపు సంతలో వరి విత్తనాలను కొనుగోలు చేస్తున్న గిరిజనులు



వారపు సంతలో అనధికారికంగా వ్యాపారులు విక్రయిస్తున్న విత్తనాలు ఇవే

సాక్షి, పాడేరు: ఖరీఫ్ నేపథ్యంలో జిల్లాలోని వారపు సంతల్లో విత్తన అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లోని పలు కంపెనీల పేరిట విత్తన ప్యాకెట్లను వ్యాపారులు తీసుకువచ్చి వారపు సంతల్లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. వీటిలో అధికశాతం వరి విత్తనాలు ఉంటున్నాయి.

30 దుకాణాలకు మాత్రమే అనుమతి

జిల్లావ్యాప్తంగా 22 మండలాల్లో ప్రభుత్వ అనుమతి కలిగిన 30 లెసెన్స్ దుకాణాలు ఉన్నాయి. వీటిలో పాడేరు డివిజన్‌లో ఆరు మాత్రమే ఉండగా మిగతావి రంపచోడవరం, చింతూరు డివిజన్లలో ఉన్నట్టుగా అధికారవర్గాలు చెబుతున్నాయి. వారపు సంతల్లో విత్తన విక్రయాలకు సంబంధించి వ్యవసాయశాఖ ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. అయినప్పటికీ వ్యాపారులు బహిరంగంగా విక్రయిస్తున్నారు. కొనుగోలు చేసిన గిరి రైతులకు ఎటువంటి రశీదులు ఇవ్వడం లేదు. దీనివల్ల పంటకు నష్టం జరిగిన సందర్భంలో సంబంధిత రైతు పరిహారం పొందే అవకాశం ఉండదు. ప్రచార లోపం వల్ల ఈ విషయం చాలామంది రైతులు తెలియక నష్టపోతున్నారు.

హైబ్రిడ్ విత్తనాల పేరిట మోసం

గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయశాఖ 1121 శ్రీధృతి, ఎంటీయూ 1318 రకాల విత్తనాలనే ఖరీఫ్‌లో ప్రోత్సహిస్తోంది. అయితే సంతల్లో వ్యాపారులు మాత్రం హైబ్రిడ్, సన్న రకాల పేరుతో గిరిజన రైతులను మోసం చేస్తున్నారు. హైబ్రిడ్ రకం విత్తనాలు మూడు కిలోల ప్యాకెట్‌ను వారపుసంతల్లో రూ.వెయ్యికి విక్రయిస్తున్నారు. గిరిజన రైతులు కూడా వ్యవసాయశాఖ సలహాలు లేకుండానే సంతల్లో వీటిని కొనుగోలు చేస్తున్నారు.

– పాడేరు డివిజన్‌లోని గుత్తులపుట్టు, హుకుంపేట, కించుమండ, అరకు, సుంకరమెట్ట, కాశీపట్నం, డముకు, ముంచంగిపుట్టు, పెదబయలు, బూసిపుట్టు, రూడకోట, మద్దిగరువు, జి.మాడుగుల, అన్నవరం, చింతపల్లి, ధారకొండ వారపుసంతల్లో అనధికార విత్తన విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో సుమారు 15 మంది వ్యాపారులు విక్రయిస్తూ రూ.లక్షల్లో గిరిజనుల నుంచి దోచుకుంటున్నారు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా వ్యవసాయశాఖ, అనుబంధ విభాగాలు వీటిపై దృష్టి సారించడం లేదు.

– జిల్లాలోని ఏటా ఖరీఫ్ సీజన్‌లో 58 వేల హెక్టార్లలో వరి సాగవుతోంది. హెక్టారుకు 50 కిలోల విత్తనం అవసరం కాగా వ్యవసాయశాఖ మాత్రం 90 శాతం రాయితీపై సాగు విస్తీర్ణంలో 60 శాతం భూములకు విత్తనాలు పంపిణీ చేస్తోంది. మిగిలిన 40 శాతం భూముల్లో 10 శాతం గిరి రైతులు సంప్రదాయ విత్తనాలను ఉపయోగిస్తున్నారు. మిగిలిన 30 శాతం భూముల్లో సాగుకు సంతల్లో కొనుగోలు చేసిన విత్తనాలను ఆశ్రయిస్తున్నారు.

కొన్నిసార్లు నష్టపోతున్నాం



విత్తన కొనుగోళ్లపై అవగాహన లేకపోవడం వల్లే వారపు సంతల్లోని వ్యాపారులను ఆశ్రయిస్తున్నాయం. కొన్ని సందర్భాల్లో దిగుబడి బాగానే వస్తోంది. కొన్ని చోట్ల పాల్లు గింజల ప్రభావం కూడా ఎక్కువగా ఉంటోంది. కనీసం రశీదులు కూడా ఇవ్వడం లేదు. స్థానికంగా అందుబాటులో ఉన్నందున ధర ఎక్కువైనా కొనుగోలు చేయాల్సి వస్తోంది.

– పాంగి బుద్రు, గిరిజన రైతు, సంతారి ఏరియా, హుకుంపేట మండలం

చర్యలు తీసుకుంటాం



వారపుసంతల్లో విత్తన విక్రయాలకు వ్యవసాయశాఖ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. సంతల్లో అమ్ముతున్న విత్తనాల నాణ్యతపై పలు అనుమానాలు ఉన్నాయి. వారపు సంతల్లో విత్తన అమ్మకాలపై తనిఖీలు నిర్వహించాలని ఏవోలకు ఆదేశాలిస్తాం.హైబ్రిడ్ విత్తనాలను వ్యవసాయశాఖ ప్రోత్సహించడం లేదు. వీటికన్నా సాధారణ రకాల దిగుబడి, నాణ్యత బాగుంటుంది.

– ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

టీడీపీ దాడులతో భయానక వాతావరణం

- వైఎస్సార్‌సీపీపై కక్ష సాధింపు దారుణం
- ప్రజాపాలనను విస్మరించిన సీఎం చంద్రబాబు
- శాంతి భద్రతలకు విఘాతం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ధ్వజం



సాక్షి,పాడేరు: రాష్ట్రంలో దాడులు చేయిస్తూ టీడీపీ ప్రభుత్వం భయానక వాతావరణం సృష్టిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆమె మాట్లాడుతూ దాడులకు పాల్పడుతూ విధ్వంసాలకు దిగడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు ప్రజా పాలనను విస్మరించి ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీపై కక్షపూరితంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. ఒకవైపు రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలతోపాటు సామాన్య ప్రజలపై దాడులకు పాల్పడుతూ టీడీపీ నేతలు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ధ్వజమెత్తారు. మరో వైపు వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయాలను కూలగొట్టే చర్యలకు పాల్పడడం దారుణమన్నారు. న్యాయవ్యవస్థ ఆదేశాలను కూడా పట్టించుకోకుండా అమరావతి ప్రాంతంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయ భవనాలను యంత్రాలతో కూల్చివేయడం బాధాకరమన్నారు. రాజకీయ పార్టీలు ప్రభుత్వ స్థలాలను లీజుకు తీసుకోవచ్చని గతంలో టీడీపీయే జీవో 340 తీసుకువచ్చిందని,ఇప్పుడు వైఎస్సార్‌సీపీ కార్యాలయాలకు నోటీసులు ఇవ్వడం, కూల్చివేత చేపట్టడాన్ని ప్రజలంతా ఖండించాలని ఆమె పిలుపునిచ్చారు.

పెదబయలు ఎంపీహెచ్‌ఈవో సస్పెన్షన్

- ఫార్మసిస్ట్ పావనిపై ఆగ్రహం
- షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీఎంహెచ్‌కు సూచన
- వైద్యాధికారి సత్యశ్రీకి మందలింపు
- విధుల పట్ల నిర్లక్ష్యంపై కలెక్టర్ విజయ సునీత తక్షణ చర్యలు



పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ సునీత



పెదబయలు పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ సునీత



సూచనలు చేస్తున్న కలెక్టర్ విజయ సునీత

పెదబయలు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీహెచ్‌ఈవో జర్రె వెంకటరావును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ విజయ సునీత ఆదేశాలు జారీ చేశారు. శనివారం పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆమె విధులపట్ల నిర్లక్ష్యాన్ని గుర్తించారు. మలేరియా సీజన్ ప్రారంభమైనప్పటికీ క్షేత్ర స్థాయి పర్యటన చేయకపోవడమే కాకుండా రికార్డులు నిర్వహించకపోవడం ఆమె పరిశీలనలో వెల్లడైంది. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల వివరాలు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడంపై ఫార్మసిస్ట్ పావనిపై కలెక్టర్ ఆగ్రహానికి గురయ్యారు. ఆమెకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషాను ఆమె ఫోన్లో ఆదేశించారు. గర్భిణి ముందుగానే ఆస్పత్రిలో చేరినప్పటికీ ప్రసవ సమయంలో వైద్యాధికారి సత్యశ్రీ హాజరు కాకుండా నర్స్‌కు అప్పగించడాన్ని తెలుసుకున్న కలెక్టర్ ఆమెను మందలించారు. ప్రసవ సమయంలో వైద్యాధికారులు తప్పని సరిగా హాజరు కావాలని, ఇటువంటివి పునారావృతం అయితే చర్యలు తీవ్రంగా ఉంటాని కలెక్టర్ హెచ్చరించారు.బాలింతలతో మాట్లాడారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించిన కలెక్టర్ మందుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. వర్షాకాలంలో డయేరియా ప్రబలే అవకాశం ఉన్నందున అందుకు సంబంధించిన అన్ని మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ సిరప్ మాత్రలు అందుబాటులో ఉంచాలని సూచించారు.

'గిన్నెలకోట' గ్రామాలకు రహదారి సౌకర్యం

మండలంలోని గిన్నెలకోట పంచాయతీ పరిధిలోని తమలం,గబ్బరుమామిడి,కొర్జంగి,కంచురాయి గ్రామాలను కలుపుతూ ఎనిమిది కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ విజయ సునీత ఆదేశించారు. శనివారం ఆయా గ్రామాలను సందర్శించిన ఆమె గ్రామస్తులతో పలు అంశాలపై చర్చించారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు అక్కడి చెక్ డ్యాంను పరిశీలించారు. వెంటనే మరమ్మతులకు అంచనా తయారు చేయాలని సూచించారు. అదనపు అదనపు చెక్ డ్యాం నిర్మాణానికి అంచనాలు తయారుచేసి అందజేయాలని ఆదేశించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచనలిచ్చారు. రెండు రోజుల్లో రేషన్ పంపిణీ పూర్తి చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం తమలం గ్రామంలో ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, పాఠ్యాంశాల బోధనపై విద్యార్థులతో మాట్లాడారు.

కాసేపు ప్రైవేట్ జీపులో.. కాలినడకన..

గిన్నెలకోట పంచాయతీ పరిధిలోని తమలం, గబ్బరు మామిడి. కొర్జంగి, కంచురాయి గ్రామాల పర్యటనలో భాగంగా బూసిపుట్టు సమీపంలోని సరియాపల్లి నుంచి తమలం వరకు సుమారు 3.50 కిలోమీటర్ల మేర రోడ్డు అధ్వానంగా ఉంది. దీంతో ఆమె కారు దిగి ప్రైవేట్ జీపులో వెళ్లారు. రాళ్లబాటలో కాలినడకన తమలం గ్రామానికి చేరుకున్నారు. తిరుగు ప్రయాణంలో జీపులో సరియాపల్లి చేరుకుని అక్కడ నుంచి జామిగుడ వెళ్లారు. జామిగుడ గుంజివాడ గ్రామాల మధ్యలో వంతెన నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోందని సర్పంచ్, గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే పనులు ప్రారంభించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శివయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, తహసీల్దార్ రామ్మోహనరావు, ఎంఈవో కృష్ణమూర్తి, గిరిజన సంక్షేమ శాఖ ఏఈ రాముడు, జామిగుడ సర్పంచ్ అచ్చియమ్మ తదితరులు పాల్గొన్నారు.



తమలంలో చెక్‌డ్యాం నిర్మించాల్సిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ సునీత

సకాలంలో నిత్యావసర సరకుల పంపిణీ

- నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు
- జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట

సాక్షి,పాడేరు: జిల్లాలోని రేషన్ కార్డుదారులకు సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట ఆదేశించారు.కలెక్టరేట్ మినీ సమావేశమందిరంలో శనివారం ఆమె పౌరసరఫరాలు, జీసీసీ, ఎంఎల్‌ఎస్ పాయింట్ల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రతి నెల 30వ తేదీ నాటికి సరుకులన్నీ సంబంధిత స్టాక్ పాయింట్లకు చేరవేయాలని సూచించారు. బియ్యం , ఇతర సరుకుల నిల్వలలో చీడపీడలు లేకుండా కార్డుదారులకు నాణ్యంగా అందజేయాలన్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్యాక్ చేసిన వస్తువుల బరువులు కచ్చితత్వం ధ్రువీకరణకు తగిన యంత్రాలు కొనుగోలు చేయాలని ఆదేశించారు. జీపీఎస్ సిస్టం ఉన్న వాహనాల్లో మాత్రమే సరుకులు రవాణా చేయాలని, నిత్యావసర సరుకుల పంపిణీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. లబ్ధిదారులకు సరుకుల పంపిణీ సమయంలో తూకం సక్రమంగా ఉండాలని, ఎక్కడ నిర్లక్ష్యం వహించినా బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీహరి,డీఎం గణేష్,జీసీసీ డీఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు విజయోత్సవ ర్యాలీ రేపు

సాక్షి,పాడేరు: స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన తరువాత తొలిసారిగా ఈనెల 24వతేదీ సోమవారం పాడేరు వస్తున్న సందర్భంగా విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆయన క్యాంపు కార్యాలయం సిబ్బంది శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాడేరు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నేతలు, కార్యకర్తలు అభిమానులు సోమవారం పాడేరులో జరిగే బైక్ ర్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు ప్రకటనలో పేర్కొన్నారు.

ఆరుద్ర రాక.. అన్నదాత పులకింత



ఆరుద్ర కార్తె శనివారం ప్రవేశించడంతో అరుదుగా కనిపించే ప్రకృతి నేస్తాలైన ఆరుద్ర పురుగులు విరివిగా దర్శనమిస్తున్నాయి. ఏటా వర్షాకాలం ఆరంభంలో మృగశిర కార్తె ముగిసిన తర్వాత వచ్చే ఆరుద్ర కార్తె ప్రారంభంలో ఇవి కనిపించడాన్ని రైతులు శుభసూచకంగా భావిస్తుంటారు. శనివారం అప్పలరాజుపేట పరిసర ప్రాంతాల్లో ఇవి వారి కంట పడటంతో వరుణుడు కరుణిస్తాడంటూ పులకించిపోయారు.

– రాజవొమ్మంగి

ఏకలవ్య పాఠశాలకు శాశ్వత ఉపాధ్యాయులు

నియమించిన కేంద్ర ప్రభుత్వం

చింతపల్లి రూరల్: స్థానిక ఏకలవ్య (ఈఎంఆర్‌ఎస్) పాఠశాలకు శాశ్వత ఉపాధ్యాయులను కేంద్ర ప్రభుత్వం నియమించిందని ప్రిన్సిపాల్ అన్నామణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. తమ పాఠశాలకు కేంద్ర ప్రభుత్వం 20 మంది శాశ్వత ఉపాధ్యాయులను నియమించిందన్నారు.ఈ మేరకు వారిలో ఇప్పటికే 14 మంది జాయన్ అయినట్లు ఆమె తెలిపారు.వీరంతా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారని ఆమె పేర్కొన్నారు. అనంతరం వారితో ఆమె సమావేశమయ్యారు.

విధుల్లోకి చేరిన 22 మంది..

రాజవొమ్మంగి: స్థానిస్థానిక ఏకలవ్య క్యాంపస్‌లో నిర్వహిస్తున్న అడ్డతీగల, రాజవొమ్మంగి పాఠశాలలకు శనివారం కొత్తగా 22 మంది ఉపాధ్యాయులు చేరారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన వారు వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. అదే విధంగా ఇక్కడ ఇప్పటి వరకు పని చేసిన అడ్డతీగ ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ ఫణికుమార్ కర్నూల్ జిల్లాకు, రాజవొమ్మంగి ఏకలవ్య ప్రిన్సిపాల్ ఎంవీ కృష్ణారావు అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు.



నియమితులైన ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అన్నామణి

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

జి.మాడుగుల : పాఠశాలల ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వహించి నాణ్యమైన విద్యను అందించాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. మండలంలో నుర్మతి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికలు, బొయితిలిలో బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలను పీవో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల హాజరు పట్టికలను తనిఖీ చేసి విద్యార్థులు ఎంత మంది పాఠశాలకు రావడం లేదని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చర్మ వ్యాధులతో బాధపడుతున్నారని గుర్తించి జిల్లా సూపరింటెండెంట్‌తో మాట్లాడి తగిన వైద్యం అందించాలని ఆయన ఆదేశించారు. చర్మవ్యాధులు రాకుండా విద్యార్థులు పరిశుభ్రంగా ఉండాలని, బట్టలు వేడినీటితో ఉతుక్కోవాలని సూచించారు. విద్యార్థులు సికిల్ సెల్ ఎనిమియా పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలు సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా చదువుకోవాలని ఆయన సూచించారు. 10వ తరగతి తరువాత సాగించే చదువుల గూర్చి ఆయన విద్యార్థులను ప్రశ్నించారు. ఇంటర్, డిగ్రీ వంటి చదువుల పట్ల దృష్టి సారించాలని సూచించారు. 10వ తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలు బోధించి, కొన్ని ప్రశ్నలను అడిగి వారి విద్యా మేధస్సును పరిశీలించారు. గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు కలసికట్టుగా గ్రామాల్లో ప్రతి విద్యార్థి పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బడి ఈడు పిల్లలు, డ్రాపౌట్ పిల్లలను గుర్తించి పాఠశాలలకు తీసుకురావాలని అన్నారు. 10వ తరగతి విద్యార్థుల చదువుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు. పాఠశాలలో మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో టిడబ్ల్యు డీడీ కొండలరావు పాల్గొన్నారు.



నుర్మతి బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఆదేశిస్తున్న పీవో అభిషేక్

కేకే లైన్‌లో జీఎం తనిఖీలు


అరకు-కొత్తవలస సెక్షన్ మధ్య బ్రిడ్జి, టన్నెల్‌లను పరిశీలిస్తున్న జీఎం పరమేశ్వర్


కోరాపుట్ రైల్వే స్టేషన్‌లో పర్యటిస్తున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్‌వాల్

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ కేకే(కొత్తవలస-కోరాపుట్) లైన్‌లో శనివారం ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్‌వాల్ తనిఖీలు నిర్వహించారు. ఈ మార్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్వహణా సామర్థ్యం, ప్రయాణికుల సదుపాయాలతో పాటు రెండో లైన్ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా రైల్ వినియోగదారులు, భాగస్వాములైన ఎన్ఎండీసీ వంటి కంపెనీల ప్రతినిధులతో సమావేశమై రైల్వే అభివృద్ధి కోసం పరస్పరం సహకరించుకోవాలని, దీని ద్వారా ఇరువర్గాలు లబ్ధి పొందుతాయని జీఎం సూచించారు. ఈ మార్గంలో గల కోరాపుట్, అరకు, శివలింగపురం స్టేషన్లలో పర్యటించి, అక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం డబ్లింగ్ లైన్, గుహలు, మలుపులు, క్రాసింగ్స్, పాయింట్స్, వంతెనలను కూడా తనిఖీ చేశారు. పర్యటనలో డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, చీఫ్ ట్రాక్ ఇంజినీర్ కె.ధనుంజయరావు, చీఫ్ ఫ్రైట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ దిబ్యంజన్ రాయ్, ఇతర ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

దొంగల ముఠా హల్‌చల్

- మూడు అపార్ట్‌మెంట్లలో చొరబడిన దొంగలు
- ఓ ఫ్లాట్‌లో 7 తులాల బంగారు ఆభరణాల చోరీ
- పీఎంపాలెంలో ఘటన


అపార్ట్‌మెంట్‌లో చొరపడుతున్న దొంగలు


అపార్టుమెంట్‌లోని సీసీ కెమెరాల్లో నమోదైన దొంగల కదలికలు

పీఎంపాలెం: పీఎంపాలెం, మధురవాడ ప్రాంతాల్లో దొంగల ముఠా హల్‌చల్ చేసింది. కారుషెడ్ కూడలికి సమీపంలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత మూడు అపార్ట్‌మెంట్లలోకి దొంగలు చొరబడ్డారు. శ్రీ తామరాంధ్ర నిలయం అపార్ట్‌మెంట్‌లోని 403, 502 ఫ్లాట్లలో చోరీ జరిగినట్టు పోలీసులు గుర్తించారు. పీఎంపాలెం సీఐ వై.రామకృష్ణ, బాధితులు తెలిపిన వివరాలివీ.. 403 ఫ్లాట్‌లో నివసిస్తున్న శశిభూషణరావు, అతని భార్య వైద్యులు. వారు విజయనగరం జిల్లా నెల్లిమర్ల వద్ద గల మిమ్స్ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్నారు. వారు అప్పుడప్పుడు ఫ్లాట్‌కు వచ్చి వెళ్తుంటారు. కాగా.. ఈ నెల 21వ తేదీ ఉదయం 7 గంటలకు అదే అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న సూర్యనారాయణ వారికి ఫోన్ చేసి.. ఫ్లాట్‌లో దొంగతనం జరిగినట్లు సమాచారమిచ్చారు. వారు వెంటనే వచ్చి ఇంట్లోని బీరువాను పరిశీలించగా.. అందులో భద్రపరిచిన 7 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే అపార్ట్‌మెంట్‌లోని 502 ఫ్లాట్‌లో నివసిస్తున్న వెంకటరావు ఇంటి తలుపు గడియలు దొంగలు విరగ్గొట్టి లోపలకు ప్రవేశించారు. ఆ సమయంలో వెంకటరావు కుటుంబ సభ్యులందరూ ఏసీ ఉన్న గదిలో నిద్రిస్తున్నారు. ఇంట్లో విలువైన వస్తువులు దొంగలకు చిక్కలేదు. ఇదంతా అర్ధరాత్రి ఒంటి గంట నుంచి 3 గంటల మధ్యలో జరిగినట్టు అపార్ట్‌మెంట్ సీసీ కెమెరాలో రికార్డ్ అయింది. అదే రోజు రాత్రి ఈ అపార్ట్‌మెంట్‌కు సమీపంలోని రత్నా రెసిడెన్సీ, మరొక అపార్ట్‌మెంట్‌లో ఇదే దొంగల ముఠా చోరీకి యత్నించినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. అయితే ఆ అపార్ట్‌మెంట్ నివాసితుల నుంచి ఎటువంటి ఫిర్యాదు రాలేదని సీఐ తెలిపారు. కారుషెడ్ కూడలికి సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో చోరీకి పాల్పడింది చెడ్డీ గ్యాంగా? మరే ముఠా అయి ఉంటుంది? అని పోలీసులు ఆరా తీస్తున్నారు. చోరీకి వచ్చిన వారు సుమారు ఆరుగురు ఆపై ఉండొచ్చని భావిస్తున్నారు. శారీరకంగా దృఢంగా ఉన్న వారంతా బనియన్, ఫుల్ ఫ్యాంట్లు ధరించి ఉన్నారు. అదే చెడ్డీ గ్యాంగ్ అయితే ఇలాంటి దుస్తులు ధరించరని పోలీసులు చెబుతున్నారు. కాగా.. చోరీకి పాల్పడిన వారిని కచ్చితంగా పట్టుకుంటామని సీఐ తెలిపారు. స్టేషన్ పరిధిలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

అన్ని వేళలా అప్రమత్తం

- పాడేరు ఏఎస్పీ ధీరజ్

జి.మాడుగుల: పోలీస్ స్టేషన్లలో సిబ్బంది అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి సమస్యలు, ఇబ్బందులు తలెత్తినా తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని పాడేరు ఏఎస్పీ ధీరజ్ ఆదేశించారు. శనివారం ఆయన స్థానిక సర్కిల్ పోలీస్ స్టేషన్, నుర్మతి ఆర్మ్‌డ్ అవుట్ పోస్టు పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయా స్టేషన్లల్లో భద్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. మండలంలో శాంతిభద్రతలు, పోలీసుల ఆరోగ్య పరిస్థితులపై ఆయన ఆరా తీసారు. పోలీస్ స్టేషన్లలో ఉండే సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా ఉండాలని, డ్యూటీల్లో కమాండోలా వ్యవరించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐ రమేష్, 198బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ రవి, ఏపీ ఎస్పీ పోలీస్ అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు

అల్లిపురం: గంజాయి తరలిస్తున్న నలుగుర్ని సిటీ టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 63 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం అల్లిపురం, సౌత్‌జైలురోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిని తనిఖీ చేయగా 63 కేజీల గంజాయి పట్టుబడింది. ఈ నలుగురు అల్లూరి జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. నిందితులను టూటౌన్ పోలీసులకు అప్పగించారు.

పలు రైళ్ల రద్దు.. రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ఆ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. ఈ రైళ్లు కాకుండా మిగిలిన రైళ్లు యథావిధిగా నడవనున్నాయి.

ఈనెల 23 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు రద్దయిన రైళ్లు

- తిరుపతి-విశాఖపట్నం(22708) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్

ఈనెల 23 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు రద్దయిన రైళ్లు

- రాజమండ్రి-విశాఖపట్నం(07466) మెము పాసింజర్, విశాఖపట్నం-రాజమండ్రి(07467) మెము పాసింజర్, మచిలీపట్నం-విశాఖపట్నం (17219) ఎక్స్‌ప్రెస్, గుంటూరు-విశాఖపట్నం (17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, గుంటూరు - రాయగడ (17243) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-లింగంపల్లి(12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్

ఈనెల 24 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు రద్దయిన రైళ్లు

విజయవాడ-విశాఖపట్నం(12718) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-విజయవాడ(12717) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-గుంటూరు (22701) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, గుంటూరు-విశాఖపట్నం (22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ (రైలు నడిచే రోజులలో), విశాఖపట్నం-తిరుపతి (22707) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్.

ఈనెల 24 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు రద్దయిన రైళ్లు

విశాఖపట్నం- మచిలీపట్నం (17220) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, రాయగడ-గుంటూరు (17244) ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి-విశాఖపట్నం(12806)జన్మభూమి ఎక్స్‌ప్రెస్.

వాల్తేర్ డివిజన్ పరిధిలో..

ఈనెల 24వ తేదీన రద్దయిన రైళ్లు

పలాస-విశాఖపట్నం(07471) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం-పలాస(07470) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం-గుణుపూర్(08522) పాసింజర్ స్పెషల్, గుణుపూర్-విశాఖపట్నం(08521) పాసింజర్‌స్పెషల్, విశాఖపట్నం-బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-భువనేశ్వర్(22820) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-భవానిపట్న (08504) పాసింజర్ స్పెషల్

ఈనెల 25న రద్దయిన రైళ్లు

బ్రహ్మపూర్-విశాఖపట్నం(18525) ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-విశాఖపట్నం(22819) ఎక్స్‌ప్రెస్, భవానిపట్నం-విశాఖపట్నం(08503) పాసింజర్ స్పెషల్

పలు రైళ్లు రీ షెడ్యూల్

- ఈ నెల 24న మధ్యాహ్నం 12 గంటలకు బయల్దేరే పూరీ-గుణుపూర్(184417) ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా మధ్యాహ్నం 1గంటకు బయల్దేరుతుంది.
- ఈనెల 23వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు బయల్దేరాల్సిన ఛత్రపతి శివాజీ ముంబయి టెర్మినస్- భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ 3గంటలు ఆలస్యంగా సాయంత్రం 5గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 24వ తేదీన ఉదయం 5.20 గంటలకు బయల్దేరాల్సిన రాయ్‌పూర్-విశాఖపట్నం 2 గంటలు ఆలస్యంగా ఉదయం 7.20 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 24న ఉదయం 8.20 గంటలకు బయల్దేరాల్సిన కోరాపుట్ -విశాఖపట్నం(08545) పాసింజర్ 3 గంటలు ఆలస్యంగా ఉదయం 11.20 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 24వ తేదీన సాయంత్రం 5.45 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం-బ్రహ్మపూర్(08532) పాసింజర్ గంట ఆలస్యంగా 6.45 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 24వ తేదీన ఉదయం 10.50 గంటలకు బయల్దేరాల్సిన సంబల్‌పూర్-నాందేడ్(208090 ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా 11.50 గంటలకు బయల్దేరుతుంది.
- ఈ నెల 24వ తేదీన తెల్లవారు 4.30గంటలకు బయల్దేరాల్సిన సికింద్రాబాద్-షాలిమర్(07225) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 3 గంటలు ఆలస్యంగా ఉదయం 7.30 గంటలకు బయల్దేరుతుంది.

యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రెగ్యులేట్

విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల నిమిత్తం ఈ నెల 30, జూలై 7,14,21,28, ఆగస్టు 4వ తేదీన యశ్వంత్‌పూర్‌లో బయల్దేరే యశ్వంత్‌పూర్-టాటా (18112) ఎక్స్‌ప్రెస్‌ను విజయవాడ డివిజన్ పరిధిలో గంట సేపు ఆయా స్టేషన్లలో నిలిపివేయనున్నారు.


విశాఖ సహకార బ్యాంక్ లక్ష్యం రూ.8వేల కోట్లు

బ్యాంక్ ఛైర్మన్ రాఘవేంద్రరావు


మాట్లాడుతున్న బ్యాంక్ ఛైర్మన్ రాఘవేంద్రరావు

సీతమ్మధార: విశాఖ సహకార బ్యాంక్ 2024-25 ఆర్థిక సంవత్సరంలో వ్యాపార లక్ష్యం రూ.8వేల కోట్లుగా నిర్ణయించినట్లు ఆ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు వెల్లడించారు. ద్వారకానగర్‌లోని బ్యాంక్ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరం(2023-24)లో రూ.7,300 కోట్ల మైలురాయిని అధిగమించామన్నారు. బ్యాంక్ ప్రస్తుతం 1,04,865 మంది సభ్యులు, రూ.352.61 కోట్ల షేర్ ధనంతో దేశంలోనే అతి పెద్ద పట్టణ సహకార బ్యాంకుల్లో ఒకటిగా స్థానం సంపాదించుకుందన్నారు. సభ్యులకు రూ.లక్ష వరకు ఉచిత బీమా సదుపాయం ఉందని, రుణాలు సక్రమంగా చెల్లించిన వారికి నాలుగు శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 2,596 మందికి రూ.5.51 కోట్ల మేరకు సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు వివరించారు. 108వ వార్షిక మహాజన సభ నిర్ణయం మేరకు రూ.33.56 కోట్లను సభ్యులకు షేరు ధనం మీద డెవిడెండ్‌గా చెల్లించామన్నారు. ఐదు కొత్త శాఖల ఏర్పాటులో భాగంగా ఈ నెల 20న షీలానగర్‌లో 51వ శాఖను ప్రారంభించామని గుర్తు చేశారు. త్వరలోనే చిత్తూరు, బాపట్ల, నరసరావుపేట ప్రాంతాల్లో కొత్త శాఖలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే 14 శాఖలకు సొంత భవనాలు ఉన్నాయని, గాజువాక, గోపాలపట్నం శాఖలకు స్థలాలు, చోడవరం శాఖ సొంత భవనం కొనుగోలు చేశామన్నారు. బ్యాంక్‌లో డైలీ డిపాజిట్ పథకం అమల్లో ఉందన్నారు. ఏడాది కాలవ్యవధిలో కోటికి పైగా డిజిటల్ లావాదేవీల ద్వారా రూ.5714 కోట్ల టర్నోవర్ జరిగిందని, గతేడాది రూ.87.79కోట్ల నికర లాభం సంపాదించామన్నారు. డిపాజిట్ల కింద రూ.4148 కోట్లు, రుణాల కింద రూ.3,199 కోట్లు మంజూరు చేశామన్నారు. బ్యాంకు సీఈవో పి.వి.నరసింహమూర్తి, డైరెక్టర్లు మానం ఆంజనేయులు, జేవీ సత్యనారాయణమూర్తి, స్టాలిన్, ఉప్పలపాటి పార్వతీదేవి, కామరాజు, చంద్రశేఖర్, జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అప్పన్నకు చందన సమర్పణ


అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి

సింహాచలం: జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి మూడవ విడత చందనం సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. తెల్లవారుజామున స్వామిని మేళతాళాలు, వేదమంత్రోచ్ఛరణలతో మేల్కొలిపారు. సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం ఆలయ భాండాగారంలో భద్రపరిచిన మూడు మణుగుల (120కిలోల) పచ్చి చందనాన్ని అర్చకులు తీసుకొచ్చి స్వామి మూలవిరాట్‌కి సమర్పించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా స్వామికి ఉదయం పంచకలశ స్నపనాన్ని నిర్వహించారు. ఆలయ ఆస్థాన మండపంలో స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. గంగధార జలాలు, పంచామృతాభిషేకాలతో అభిషేకాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి చందన సమర్పణ చేసి.. విశేషంగా హారతులిచ్చారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలి

- ఏడీఆర్ ముకుందరావు



మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: రైతులు నారుమడులు తయారు చేసుకునేందుకు సిద్ధం కావాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నూతన ఏడీఆర్ సిహెచ్.ముకుందరావు అన్నారు. ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులతో శనివారం టీ అండ్ వి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావలసిన వరి విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులను అందజేయడానికి వ్యవసాయ అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రైతులు నారుమడులు తయారు చేసుకోవడానికి సమాయత్తమవుతున్నారని, సరైన వర్షాలు నమోదైతే జూలై మొదటి వారం నుంచి ఈ పనులు ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. ఆర్ఏఆర్ఎస్‌లో ఆర్‌జేఎల్- 2537 వరి విత్తనాలు, ఎలమంచిలి - 66 నువ్వు విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నట్టు ఆయన చెప్పారు. కె.వి.కె. కొండెంపూడిలో 30 క్వింటాళ్ల ఆర్‌జేఎల్-2537 వరి విత్తనాలు, ఎలమంచిలి-66 నువ్వు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని తెలియజేశారు. వ్యవసాయ అధికారుల కోరిక మేరకు ఆర్.ఎ.ఆర్.ఎస్ ఎంటీయూ-1262 రకం విత్తనాన్ని రెండు ఎకరాల్లో పండించి రైతులకు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహనరావు, ప్రధాన శాస్త్రవేత్తలు పి.వి.కె.జగన్నాథరావు, ఆదిలక్ష్మి, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.